క్లుప్తంగా

శాకంబరీదేవిగా కనకదుర్గమ్మ



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

ఒంగోలు మెట్రో: ఆషాడమాసంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అమ్మవార్ల దేవాలయాలలో మూలమూర్తులను శుక్రవారం శాకంబరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఒంగోలు నెహ్రూకాలనీలోని కనకదుర్గమ్మవారికి ఉదయం పంచామృతాల అభిషేకం, సుగంధ పరిమళ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీ రూపంలో ఉన్న కనకదుర్గమ్మవారిని భక్తులు దర్శనం చేసుకున్నారు. ముందుగా నిర్వాహకులు ఆలయాన్ని చూడచక్కని పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

112 మంది రోగులకు వైద్య పరీక్షలు

మద్దిపాడు: స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ ఆధ్వర్యంలో ఒంగోలు కిమ్స్ ఆస్పత్రి డాక్టర్లు మండలంలోని బసవన్నపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని 112 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. వినికిడి లోపం ఉన్నవారితో పాటు ఈసీజీ, షుగర్, బీపీ, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను రోగులకు ఉచితంగా అందించారు. కిమ్స్ ఆస్పత్రి డాక్టర్ ఆంజనేయులు, సూపర్‌వైజర్ బాలకోటయ్య, హెచ్‌వీ నాగరాజి, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంకువారిగుంటకు స్తంభించిన రవాణా

- వర్షానికి కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు
- తాగునీరు కూడా లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు



వర్షానికి అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి నీళ్లు నిలిచిన దృశ్యం

కొత్తపట్నం: మండలంలోని సంకువారిగుంట గ్రామానికి వెళ్లే అప్రోచ్ రోడ్డు గురువారం రాత్రి కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో ఆ గ్రామానికి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కనీసం తాగునీరు కూడా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈతముక్కల–సూరారెడ్డిపాలెం రోడ్డులో మధ్యలో నుంచి సంకువారిగుంట గ్రామానికి వెళ్లే రోడ్డు ఉంది. ఈ ఆర్అండ్‌బీ రోడ్డులో సంకువారిగుంట గ్రామానికి వెళ్లే దారిలో పెద్ద వాగు ఉంది. ఈ వాగుపై ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. తాత్కాలికంగా వేసిన అప్రోచ్ రోడ్డు మీదుగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి భారీగా నీళ్లు నిలిచాయి. దీంతో సంకువారిగుంటకు రాకపోకలు స్తంభించాయి. ఆహార సామగ్రితో పాటు కనీసం తాగునీరు కూడా అందక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అప్రోచ్ రోడ్డు సక్రమంగా వేయకపోవడం వలన వర్షానికి కొట్టుకుపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టి తమ గ్రామానికి రాకపోకలను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, నాయకులు

కొత్తపట్నం: మండల కేంద్రమైన కొత్తపట్నంలో ఈ నెల 20వ తేదీ నిర్వహించనున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి కోరారు. సంబంధిత వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించి కార్యకర్తలందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి అన్ని గ్రామ పంచాయతీలలోని వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ఆ వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమానికి పార్టీలోని వివిధ స్థాయిల నాయకులు, ఎంపీపీలు, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ డైరెక్టర్‌లు, గ్రామ కమిటీలు, బూత్ కమిటీ మెంబర్లు, అనుబంధ సంస్థల నాయకులు, మహిళా నాయకులు, యువకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి దోనె రామ్మోహన్‌రెడ్డి, కొత్తపట్నం గ్రామ అధ్యక్షుడు తంబి వెంకటేష్, రమ, హరినారాయణ, తాత నాంచార్లు, సుధాకర్‌రెడ్డి, తంబి వెంకటేశ్వర్లు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

22న మద్దిపాడు మండల సర్వసభ్య సమావేశం

మద్దిపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 22వ తేదీ స్థానిక కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా వారి శాఖల పురోగతికి సంబంధించిన సమాచారం తీసుకురావాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సొసైటీల అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు, గ్రామాల కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

దేవస్థానం షాపులకు 22న బహిరంగ వేలం

ఒంగోలు మెట్రో: స్థానిక కొత్తపట్నం బస్టాండ్ సర్కిల్ వద్ద ఉన్న రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఒంగోలు నగరంలోని ట్రంకు రోడ్డులో కేరళ బేకరీ పక్కన ఉన్న షాపుల లీజుకు ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి బోడపాటి శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానం ఆవరణలో ఎండోమెంట్ అధికారుల సమక్షంలో నిర్వహించనున్న ఈ వేలంపాటకు సంబంధించి మరిన్ని వివరాలకు 7013830673 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కేఎన్‌పీఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

చీమకుర్తి: కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి దుడ్డు వెంకట్రావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌ను రెండు సంవత్సరాల క్రితం అరెస్ట్ చేసి ఉత్తరాది రాష్ట్రంలోని జైలులో ఉంచటాన్ని నిరసిస్తూ ఆ సంఘ రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా విచారణ జరపకుండా బెయిల్ నిరాకరిస్తూ రెండు సంవత్సరాలకుపైగా ప్రభాకర్‌ను జైలులో ఉంచడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్లో 33 కేవీ మద్దిపాడు నూతన లైన్ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వెల్లంపల్లి, కొలచనకోట, గుండ్లాపల్లి, బూరేపల్లి, గడియాపూడి, గార్లపాడు, గ్రామాల వినియోగదారులకు ఉదయం 7 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి రూరల్: చీమకుర్తి పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని జవహర్ హాస్పిటల్, బంగారమ్మతోపు, దన్నెపురం, నవాబ్‌పేట, ఇసుకవాగు సెంటర్, గంగవరం రోడ్డుకు ఇరువైపులా ఉన్న గృహాలు, పారిశ్రామిక వినియోగదారులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భవిత కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్ఎస్ఏ అధికారి



భవిత సెంటర్‌ను తనిఖీ చేస్తున్న సమగ్ర శిక్ష అధికారి

చీమకుర్తి: చీమకుర్తిలోని భవిత కేంద్రాన్ని ఎస్ఎస్ఏ సహిత విద్య సమన్వయకర్ పీ నాగేంద్ర నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. భవిత కేంద్రంలోని విద్యార్థులను, వారి సామర్థ్యాలను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఇన్‌స్ట్రక్టర్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

23న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 23వ తేదీ నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ముఖ్య అధికారులు పాల్గొని సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. గ్రామీణ అభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం, తదితర శాఖలపై సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



పూజలో పాల్గొన్న మహిళలు

చీమకుర్తి రూరల్ (సంతనూతలపాడు): సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆషాడ మాసం పూజల్లో భాగంగా శుక్రవారం రాత్రి శాకాంబరీదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు పూజలందుకున్నారు. ఆలయ అర్చకుడు నేలబొట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లతో అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనగా, ప్రసాదాలు పంపిణీ చేశారు.

హైస్కూల్‌కు స్థల పరిశీలన



కె.పల్లెపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వరరావు

కొత్తపట్నం: మండలంలోని కె.పల్లెపాలెం సౌత్‌లోని మండల ప్రజా పరిషత్ స్కూల్‌ను పదో తరగతి వరకు హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని ఆ గ్రామస్తులు స్పందనలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళేశ్వరరావు శుక్రవారం సాయంత్రం పల్లెపాలెం సౌత్‌లోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు అన్ని వసతులున్నాయో.. లేవోనని పరిశీలించారు. గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. పల్లెపాలెం నుంచి కొత్తపట్నం హైస్కూల్‌కు సుమారు 370 మంది విద్యార్థులు వెళుతున్నారని, మరో 300 మంది విద్యార్థులు ప్రైవేటు స్కూల్‌కి వెళుతున్నారని స్థానికులు తెలిపారు. ఐదో తరగతి చదివిన తర్వాత హైస్కూల్ కోసం దూరం వెళ్లలేక డ్రాపవుట్‌గా మారుతున్నారన్నారు. గతంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలగా ఉండేదని, అయితే 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందని తెలిపారు. అప్పటి నుంచి డ్రాపవుట్ పిల్లలు ఎక్కువ అవుతున్నారని చెప్పారు. హైస్కూల్ ఏర్పాటు చేయాలంటే ఎనిమిది రూములు కచ్చితంగా ఉండాలని, హెచ్‌ఎం రూమ్, స్టాఫ్ రూమ్, ఆరు తరగతి గదులు ఉండాలని ఉపవిద్యాశాఖాధికారి తెలిపారు. మరుగుదొడ్ల సౌకర్యం, క్రీడా ప్రాంగణం చూపించాలన్నారు. ఐదు ఎకరాలను స్కూల్ పేరున రిజిస్ట్రేషన్ కూడా చేయించాలన్నారు. హైస్కూల్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి గ్రామస్తుల అభిప్రాయాలను జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక ద్వారా సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు పిన్ని నరసింహారావు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు, సౌత్ స్కూల్ చైర్మన్ పిన్ని దేవప్రసాద్, విశ్రాంతి ఉపాధ్యాయుడు పిన్ని యానాదిరావు, మహిళలు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన మున్సిపల్ వర్కర్ల సమ్మె



చీమకుర్తిలో ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ వర్కర్లు

చీమకుర్తి: మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ చేస్తున్న సమ్మె శుక్రవారంతో మూడోరోజుకు చేరుకుంది. తమ డిమాండ్‌లను పరిష్కరించాలని చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు పూసపాటి వెంకట్రావు మాట్లాడుతూ గత సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, జీఓ నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులు, కోవిడ్ కార్మికులకు జీతాలు చెల్లించాలని, గ్రాట్యుటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని, ఉద్యోగ కాలపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, దహన సంస్కారాలకు రూ.20 వేలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆటోవాలాల చైతన్యానికి స్పందన



గుంతల రోడ్డును చదును చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

యర్రగొండపాలెం: గుంతలతో కూడుకున్న రోడ్లపై తమ వాహనాలు నడపలేక ఆటో డ్రైవర్లే పుల్లలచెరువు రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చుకున్న సంఘటన గత నెల 29న 'సాక్షి'లో 'గుంతలు పూడ్చుకున్న ఆటో డ్రైవర్లు' శీర్షికన ప్రచురితమైన వార్తకు రోడ్లు, భవనాల శాఖాధికారులు స్పందించారు. ఈ మేరకు యర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువుకు వెళ్లే రోడ్డును అభివృద్ధి పరిచేందుకు సన్నాహాలు చేశారు. తొలివిడతగా యర్రగొండపాలెం వైపు నుంచి 10 కిలో మీటర్ల వరకు తారు రోడ్డు వేసేందుకు రూ.2.85 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేస్తామని ఆ శాఖాధికారి ఒకరు తెలిపారు.

వైఎస్సార్ సీపీ సమావేశానికి విశేష స్పందన

- కరుణించిన వరుణుడు
- కూటమి కుట్రలు భగ్నం
- భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న కారుమూరి, శ్యామల, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి



వైఎస్సార్ సీపీ నాయకులను సత్కరిస్తున్న కార్యకర్తలు

దర్శి: పట్టణంలోని బూచేపల్లి నివాసంలో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభకు విశేష స్పందన లభించింది. శుక్రవారం స్థానిక బూచేపల్లి నివాసం వద్ద ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు పట్టణంలో భారీ వర్షం కురిసింది. 8 గంటల నుంచి వరుణుడు శాంతించాడు. దీంతో ఆగమేఘాల మీద సమావేశం ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టుదలతో వచ్చిన కార్యకర్తలందరూ సమావేశం ప్రాంతంలో మట్టి, బురద లేకుండా ట్రాక్టర్‌లతో డస్ట్ తోలించి కార్యకర్తలే స్వయంగా పట్టలు వేసి కుర్చీలు వేసి రెండు గంటల్లో సమావేశం ప్రారంభించారు. అందరూ కలిసికట్టుగా ఎలాగైనా సమావేశాన్ని సక్సెస్ చేయాలని కార్యకర్తల్లో నూతన ఉత్తేజం సంతరించుకుంది. నియోజకవర్గంలోని ఐదు మండల కేంద్రాల నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్లు, ద్విచక్ర వాహనాలపై సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఐదు మండలాల నుంచి ఎవరికి వారు ద్విచక్ర వాహనాలపై నేరుగా సమావేశం హాలు వద్దకు చేరుకున్నారు. పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని అడ్డుకున్న కూటమి నాయకుల ఎత్తులను చిత్తు చేస్తూ పార్టీ కార్యాలయం నుంచి సమావేశం హాలు వరకు తమ అభిమాన నాయకులకు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జై జగన్, జై బూచేపల్లి.. అని కార్యకర్తల నినాదాలతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ముఖ్య అతిథులుగా హాజరైన వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరు నాగేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిలు మాట్లాడుతున్నంత సేపు కార్యకర్తలు, నాయకులు కరతాళ ధ్వనులు, విజిల్స్‌తో సభాప్రాంగణం దద్దరిల్లింది. అతిథులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

కూటమి కుయుక్తులు భగ్నం

కూటమి ప్రభుత్వం చేసిన కుయుక్తులన్నీ భగ్నమయ్యాయి. అప్పటి వరకు కురిసిన వర్షానికి చల్లని గాలుల మధ్య రెండు గంటల వరకు జరిగిన సమావేశంలో కార్యకర్తలు తమ నాయకుల ప్రసంగాలను శ్రద్ధగా విన్నారు. వేలాది మంది కార్యకర్తలతో ఆ ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను స్క్రీన్‌పై వేసి ప్రజలకు చూయించారు. చంద్రబాబు ఇచ్చిన 143 హామీలు, మ్యానిఫెస్టోలో ఉండే హామీల గురించి తెలుసుకునే క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేసి కార్యకర్తలకు పంచారు.



వైఎస్సార్ సీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



భారీగా హాజరైన ప్రజలు

దళ్ సైనిక్ క్యాంపునకు క్విస్ కాలేజీ విద్యార్థి



ఒంగోలు సిటీ: ప్రతిష్టాత్మక దళ్ సైనిక్ క్యాంపునకు స్థానిక క్విస్ కాలేజీ ఇంజినీరింగ్ విద్యార్థి ఎంపికైనట్లు విద్యాసంస్థల అధినేత సూర్య కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విజయ్ ఎన్‌సీసీ ట్రైనింగ్లో సత్తాచాటాడు. 34వ ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్ ఒంగోలు నుంచి జాతీయస్థాయి దళ్ సైనిక క్యాంపునకు వెళ్లనున్నాడు. జూలై 7 నుంచి 16వ తేదీ వరకు అనంతపురంలో జరిగిన దళ్ సైనిక్ క్యాంపులో ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విజయ్‌ని విద్యాసంస్థల అధినేతతో పాటు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ హనుమంతరావు శుక్రవారం అభినందించారు.